స్కెచ్

# నిద్రలేని రాత్రి

ఆచంట శారదాదేవి

ప్రపంచమంతా హాయిగా నిద్రపోతుండగా తనుమాత్రం మేలుకొని ఉండడం ఎంత బాధ!— అందులో, ప్రక్కన మనిషి హాయిగా గుర్రు పెడుతూ ఉంటే



ఆచంట శారదాదేవి

ఆవేళ రాత్రి నాటకానికి వెళ్లారు నాటకం చూస్తూ వచ్చిన తలనొప్పి ఇంకా పోనేలేదు ఏమి నాటకం! 'బెనిఫిట్ షో" అట!

చాతా వాతా కాని వాళ్ళంతా నాటకాలాడి, హాయిగా బ్రతుకుతున్న వాళ్ల నెత్తిన రుద్దకపోతే ఏమో! ఊరికే, 'ధర్మమని' అడుగకూడదూ?

అబ్బా! నిద్దరరాక పోతే ఏవేవో ఆలోచనలు వస్తూనే ఉంటాయి తలనొప్పికి తోడు ఈ ఆలోచనలతో మెదడు దిమ్మెక్కి పోతుంది

ఏవేవో పిచ్చి ఊహాలు!

ఆ రోజంతా జ్ఞాపకం వస్తుంది! తను అసలు ఆ నాటకానికి వెళ్ళాలనుకో లేదు ప్రొద్దున్నే మాలతి వచ్చింది "ఏమండీ! ఇవ్వాళ మా కాలేజీలో నాటకం వేస్తున్నాం బెనిఫిట్ షో! మీరు తప్పకుండా రావాలి!"

"ఓ! అల్లాగే! అల్లాగే!"—అంటున్నారతను, అనవసరంగా గట్టిగా నవ్వుతూ

లిప్‌స్టిక్కూ, జార్జెట్టు చూస్తే ఈ మగవాళ్లకు ఉన్నమతి కూడా పోతుంది

"రెండు పాతిక రూపాయల టిక్కెట్లు ఇస్తున్నానండి" అని మాలతి—

వంట ఇంటిలోనుంచి వింటూన్న తనకు గుండెలో రాయి పడినట్లయింది ఎంత మాటచాతుర్యం చూపినా, అధికారం చెలాయించినా, భార్య దగ్గరే! పరాయి స్త్రీలను చూస్తే, మంత్రముగ్ధులైనట్టు పెదవి కదపలేరు! మెదలకుండా తీసుకొని ఊరుకుంటారు కాబోలు! ఏంచేస్తారో అనుకుంటూండగానే, భర్తలోపలికి వచ్చారు

"చూడు! జానకీ!! మాలతి వచ్చింది"

"ఆ! అంతా వినపడింది. 'ఇవ్వాళ వేరే పని ఉంది, రావడానికి ఏమాత్రం వీల్లేదు ఏం అనుకోవద్దు అని చెప్పి పంపివేయ్యి కూడదూ! పోనీ నేను చెప్పనా?"

'అబ్బే—పాపం! చిన్నబుచ్చుకోదూ?'

'ఐతే ఏం చేద్దాం మరి?'

'నీదగ్గిర ఉన్న ఏభైరూపాయలు ఇవ్వరాదూ? ని చీర తరువాత కొనుక్కో వచ్చు చీర కిప్పుడు తొందర లేదుగా!'

—ఎన్నాళ్లనుంచో ఆ చీర కొందామను కోవటం! మొగ మాటం కొద్దీ ఇబ్బంది పడ టమా!

—ఏది వచ్చినా తిరిగి తిరిగి తన నెత్తినే పడుతుంది కాదంటే అతను బాధపడుతాడేమో నని అన్నింటికి తనే సర్దుకు ఊరుకుంటుంది. ఎన్నాళ్ళనుంచి ఆ గులాబీ చీరకొనాలని ప్రయ త్నం! అతనికి ఆ రంగు ఇష్టం లేదు అసలు అందుకనే, ఎప్పుడూ ఏదో వంకతో అది వెనక్కు వెళుతూనే ఉంటుంది

'సరే! మీ యిష్టం కాని, ఒక్క టిక్కెట్టె కొనండి. నేను రావడానికి వీలులేదు సుబ్బ లక్ష్మమ్మగారితో ఇవ్వాళ సినీమాకి వస్తానని చెప్పాను. నేను వెళ్ళకపోతే, పాపం, ఆవిడా మానుకొంటుంది'

"ఓస్! పోనిద్దూ! ఇప్పుడు ఆవిడతో వెళ్ళ కపోతేనేం చూద్దాంలే"

ఎప్పుడో ఒకసారి విశ్వప్రయత్నం మీద తప్ప, సుబ్బలక్ష్మమ్మగారికి ఇల్లు కదలడానికి అవకాశమే దొరకదు ఇవాళ్ళ, తన మూలాన, ఆవిడ ప్రయత్నమంతా వృధాఐంది వస్తానని చెప్పి, రానందుకు ఏమనుకుందో!

—నాటకంలో ఉన్నంత సేపూ ఇదే ఆలో చన

'మాలతితో తప్పకుండా వస్తామని చెప్పా నుగదా, వెళ్ళకపోతే ఎలాగ' అని అతనివాదన.

మరి, తనూ, సుబ్బలక్ష్మమ్మ గారితో 'తప్ప కుండా వస్తానని' చెప్పిందిగా! అది ఫరవా లేదేమో! సుబ్బలక్ష్మమ్మ చదువుకోలేదుగా— ఆవిడతోమాట తప్పితే మాత్రం ఏం!

అసలు అతనికి తను ఆవిడతో స్నేహంగా ఉండడమే ఇష్టం లేదు. "ఆవిడతో ఏమిటీ కబుర్లు! ఎంతసేపూ వంటయింటిని గురించేగా మాటలు!"—ఎంత హేళన!

...చదువుకున్న ఆడవాళ్ళంతా దేనినిగురించి మాట్లాడుతూ ఉంటారో! అసలు ఈ చదువు కున్న మగవాళ్ళంతా మాత్రం దేనిని గురించి మాట్లాడుతారు! ఇరవై నాలుగు గింటలూ తమ ఆఫీసు విషయాలు కాకపోతే! తనకు ఆఫీసు లేదాయె! రోజంతా తప్పనిసరిగా, వంట ఇంటి లోనే కాలక్షేపం చేస్తూ ఇంక దేనిని గురించి మాట్లాడ కలుగుతుంది—ఎంత చదువు చదివితే ఏం!

వీధిముఖం చూడడానికైనా తీరిక లేదే. ఐనవేళ, కానివేళ, ఎవరో స్నేహితులు దిగు తూనే ఉంటారుగా—కాఫీకి, భోజనానికి ఎన్ని సార్లు, విస్తట్లో పెట్టుకోబోయిన అన్నం ఆవచ్చి

నవారికి వడ్డించి, తాను మళ్ళీ వంట మొదలు పెట్టలేదు! రాత్రి తొమ్మిదింటికైనా సరే, ఎవరైనా వస్తే కుంపటి రాజేయవలసిందే గదూ కాఫీ కని ఈ స్నేహితులు కులాసాగా కబుర్లు చెప్పుకోటానికి వస్తారో లేక కాఫీ కోసరమే వస్తారో! చాదస్తం!! హాయిగా భోంచేసివచ్చిన వాళ్ళ చేత బలవంతంగా కాఫీ త్రాగించడం దేనికో!

మర్యాదట! మాట్లాడితే, "నీదంతా పూర్వ కాలం పద్ధతి—నీకేం తెలుసు' అంటారు ఏం అహంభావం!!

ఆలోచిస్తో, ఆలోచిస్తో, జానకికి అతను తనను నిజంగా అన్యాయం చేస్తున్నాడేమో అనిపించింది తనకూ ఏవో అభిప్రాయాలూ, ఊహాలు కోరికలు ఉంటాయనీ, అవి ఫలించకపోతే తనకూ కాస్తో కూస్తో బాధ కలుగుతుందని, అతనికెందుకు తోచదో!

తన ఆశలు, అభిరుచులు అన్నీ అతని భావాలకనుగుణంగా మారి పోవాలనుకుంటాడు అతని కిష్టంలేని రంగులు కట్టగూడదు అతనికి నచ్చని సినిమాలు చూడ కూడదు, అతనికి బాగున్న పుస్తకాలే తనకూ బాగుండాలి తనకు ఎంత ప్రియమైన పుస్తకాలైనా సరే, అతనికి నచ్చకపోతే, చాటుగా చదువుకో వలసిందే— అతని వెక్కిరింపుకు భయపడి

తన అభిరుచులు కొన్నైనా వేరుగా ఎందుకు ఉండకూడదో! ఇది ఎక్కువ సంస్కారమున్నదన్న గర్వమో లేక పురుషులందరికీ స్వభావ సిద్ధంగా ఉండే అహంభావమో! తనకోసం అతను మార కూడదూ? అతని అలవాట్లను కొంచమైనా ఎందుకు మార్చుకోలేరో! రెండేళ్లైనా, ఈ సిగరెట్టు వాసన ఇంకా భరించలేకుండానే ఉంది— 'తల తిరుగు తోంది' అని చెప్పినా ఎందుకు వినరో!

అతనికోసం, అతని ఆనందం కోపం, తను ఎంత ఉత్సాహంతో ప్రయాస పడుతోంది! అతనికోసం, అతని ఆనందం కోసం ఎన్ని ఇబ్బందులు సహిస్తూంది!

ఎన్ని విషయాలలో, తన కిష్టంలేక పోయినా మనసు సరిపుచ్చుకుంటున్నదో, అతనికి ఎప్పటికైనా తెలుస్తుందా? తనకే తెలియదు, అసలు, — ఎప్పుడో ఇల్లాగ నిద్రరాని రాత్రి ఏవేవో ఆలోచనలు రేగినప్పుడు తప్ప

—ఉన్నట్టుండి, గాలికి కిటికీలు తెరుచుకున్నాయి. లోపల వెన్నెల పడింది. బయట పందిరి మీదనుంచి జాజిపువ్వుల వాసన గుప్పుమంది

వెన్నెట్లో ఆమె హృదయం కాస్త శాంత పడింది రాత్రంతా, ఇంత మనోహరంగానే వెన్నెల కాస్తూన్నది కాబోలు! నిద్ర మత్తులో ఉన్న ప్రపంచానికి వెన్నెల ఎందుకో!

ఎవరు చూచి సంతోషించను!— 'అడవి గాచిన వెన్నెల' అంటే, ఇదేనేమో!

అబ్బా! నిద్రలేక తలదిమ్మెకింది దూరాన మువ్వలమ్రోత పాలవాళ్ళు ఆవుల్ని తోలుకు వెళుతున్నారు కాబోలు .

తెల్లవార వచ్చింది అబ్బా! ఒక్క పావు గంటైనా నిద్రపడితే బాగుండును! ఈ కళ్లమంటలు కొంచెమైనా తగ్గునేమో! లేక పోతే, తెల్లవారి పనే చెయ్యలేదు.

'జానకీ! కాఫీ తెస్తావా?' నిద్రమత్తులోనే ఆ కోరడము! రోజూ కాఫీ కప్పు చేతికి వస్తేనే గాని అతనికి మెలుకువ రాదు ఒకొక్కప్పుడు, ఆమెను లేపి, కాఫీ కాచమని, తాను మళ్ళీ నిద్రపోతుంటాడు!

ఇవ్వాళమాత్రం జానకి వినిపించుకో లేదు ఆమె కప్పుడే కొంచెం నిద్ర పడుతోంది కాని, అవతలి మంచం మీదనుంచి ఇంకా, 'కాఫీ' కాఫీ!' అనే ఆర్తనాదం వినబడుతూనే ఉంది—జానకి లేచేవగకూ ఆగలేదు

"ఊ! అమ్మా!"—పూర్తిగా మెలకువ తెచ్చుకోలేక, ఆ బాధ

కప్పు చేతికిచ్చి, జానకి వెళ్లబోయింది

"చూడు! ఇవ్వాళ ఆదివారం కాదూ? శ్యామలరావునీ, గణపతినీ భోజనానికి రమ్మన్నాను—ఇక్కడే పేకాడుకో వచ్చని వంట పెందలాడే అవుతుందా?"

జానకి ముఖం వాడింది—ఒక్క క్షణం మాత్రమే! మళ్ళీ, మామూలు ఉత్సాహంతోనే అన్నది

'ఓ! కాకేం చేస్తుంది పేపరు పైకి తేనా? లేకపోతే క్రిందికి దిగి వస్తారా?"

"ఇదుగో వస్తున్నాను"

—ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ మేడ దిగారు

ఆమె నిద్రలేనికళ్ళు చూశాడు అతను కాని, "రాత్రి సరిగా నిద్రపట్ట లేదా? వంట్లో ఖులాసాగా ఉన్నదా!" అని అడగాలని అతనికి తోచలేదు

"నాకు రాత్రంతా నిద్రపట్టలేదు ఒక్కటే తలనొప్పి వంట్లో ఏం బాగుండ లేదు' అని చెప్పాలని ఆమెకూ తోచలేదు

నవ్వుతూ, రెండోకప్పు కాఫీ అతనిచేతి కందించింది జానకి

కాఫీ తాగుతూ, అతను పేపరులో తల దాచుకున్నాడు!

★

